సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం । 6 । మార్చి । 2023



ప్రవేశాలపై స్పష్టత కరువు?

మహబూబ్‌నగర్‌లో వాలీబాల్ అకాడమీ ఏర్పాటైనా.. ప్రవేశాలపై స్పష్టత కొరవడింది.

వివరాలు 8లో ▸



కనులపండువగా కల్యాణం

కందూరులో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం కనులపండువగా జరిగింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /20.4

వాతావరణం

తెల్లవారుజామున చలి ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: గంగన్‌పల్లి సబ్ స్టేషన్‌లో 132కేవీ పరిధిలోని 33కేవీ నందిన్నె ఫీడర్‌కు అధిక లోడ్ ఉండడంతో వీటి స్థానంలో నూతన ఫీడర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీంతో సోమవారం మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు ఒక ప్రటకనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ పరిధిలోని నందిన్నె, మల్లాపురం, ఉమిత్యాలతో పాటు ఈ ప్రాంతాల్లోని ఉప కేంద్రాలకు కూడా విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు, రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీడీపీఓగా హేమలత

గద్వాల అర్బన్: గద్వాల అర్బన్ ప్రాజెక్టు సీడీపీగా హేమలతను నియమిస్తూ మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గతంలో ఇంచార్జ్ సీడీపీఓగా వెంకటేశ్వరి బాధ్యతలు నిర్వర్తించారు. ఈమె స్థానంలో బాలరక్షక్ భవన్ కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న హేమలతను సీడీపీఓగా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు సైతం స్వీకరించినట్లు హేమలత తెలిపారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

మల్దకల్: రాష్ట్రంలోని పేదలందరికీ ప్రభుత్వం ప్రైవేట్ భాగస్వామ్యంతో ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించాలని సాధన సమితి జాతీయ అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్కూరుకి చైతన్య సాధన సమితి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో మంది పేదలు నేటికీ సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉచిత విద్య, వైద్య సాధన కోసమే రాష్ట్రం మొత్తం ఈ చైతన్య యాత్ర నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో తిరిగి ప్రజలకు కరపత్రాలతో అవగాహన కల్పించారు. అలాగే ఏప్రిల్ 20న హైదరాబాద్‌లో జరిగే మహాగర్జన సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కిసాన్ మజ్దూర్ సంఘర్షణ ర్యాలీ, వచ్చేనెల 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వ్యవసాయం, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర చేస్తుందని, కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు, సౌకర్యాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిందని, తద్వారా కార్మికులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు వచ్చాయన్నారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఇప్పటికైనా విడనాడి గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు మోహన్, కురుమూర్తి, లక్ష్మయ్య, గాలెన్న, జగన్, దీప్లానాయక్, సాధన, మంజుల, శివలీల, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా పీజీ డిప్లొమా కోర్సులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో కొత్తగా పీజీ డిప్లొమా కోర్సులు ప్రవేశపెట్టినట్లు ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.పద్మావతి, రీజినల్ కోఆర్డినేటర్ విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో ప్రవేశం పొందే విద్యార్థులు ఈ నెల 10 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.braou. online.in లేదా www.braou.ac.in ను చూడవచ్చన్నారు. అలాగే సెల్ నం.73829 29570, 7382929580లను సంప్రదించాలని కోరారు.

మిర్చి రైతుకు ఊరట



మానవపాడు మండలంలోని చెన్నిపాడు శివారులోని పొలంలో ఎండుమిర్చి తాలు తీస్తున్న రైతులు

- నేటి నుంచి గద్వాల యార్డులో కొనుగోళ్లు
- తొలగనున్న విక్రయ ఇక్కట్లు
- జిల్లాలో 36,757 ఎకరాల్లో సాగు

గద్వాల వ్యవసాయం: నడిగడ్డ ఎండు మిర్చి రైతుకు ఊరట లభించనుంది. మార్కెటింగ్ సౌకర్యం లేక ఎండుమిర్చి పంటను విక్రయించుకోవడానికి ఇన్నాళ్లు నానా అవస్థలు పడ్డారు. అయితే ఈనామ్ విధానం ద్వారా గద్వాలతోపాటు కర్నూల్ వ్యాపారస్తులు గద్వాల మార్కెట్‌యార్డులో ఎండుమిర్చి కొనుగోలు చేయడానికి ముందుకొచ్చారు. సోమవారం నుంచి కొనుగోళ్లకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక నుంచి ఎండుమిర్చి రైతుల విక్రయ ఇక్కట్లు తొలగనున్నాయి.

ఈ ఏడాది 2,700 ఎకరాల్లో అధికంగా సాగు

12ఏళ్లుగా జిల్లాలో రైతులు ఎండుమిర్చి సాగుపై అధికంగా దృష్టి సారిస్తున్నారు. బోర్లు, బావుల క్రింద, నల్లరేగడి భూముల్లో వర్షాధారం కింద మిర్చి సాగు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించి, పంట బాగా చేతికి వస్తే పత్తి కన్నా మిరపకి మంచి ధరలు లభిస్తాయన్న ఉద్దేశ్యంతో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. మిరప పంట కాలం నాలుగు నెలలు. పంట కోత తర్వాత కల్లాల్లో పదిహేను రోజులపాటు ఎండలో బాగా ఆరబెట్టి మార్కెట్‌లో విక్రయిస్తారు. ఎకరాకు 15నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.60వేల వరకు సాగు ఖర్చులు అవుతాయి. అయితే గడిచిన ఏడాది కన్నా ఈ ఏడాది 2,700 ఎకరాల్లో అధికంగా సాగు చేశారు. మొత్తంగా 36,757 ఎకరాల్లో ఎండు మిర్చి సాగు అయ్యింది. కరుణ, సూపర్‌టెన్, జిత్రి, కావేరి తదితర రకాలను వేశారు.

జిల్లాలో ఎండుమిర్చి సాగు వివరాలు

మండలం	సాగు (ఎకరాల్లో)
ఇటిక్యాల	8,244
మానవపాడు	4,789
గద్వాల	4,622
అయిజ	3,948
గట్టు	3,624
మల్దకల్	3,348
ఉండవల్లి	3,298
రాజోళి	1,926
అలంపూర్	1,313
వడ్డేపల్లి	1,040
ధరూరు	466
కేటీదొడ్డి	139

మార్కెటింగ్ సౌకర్యం లేక..

ఏటా దాదాపు 20వేల నుంచి 30వేల ఎకరాలకు పైగా ఎండుమిర్చి సాగు చేస్తున్నప్పటికీ జిల్లాలో మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల రైతులు విక్రయానికి అనేక అవస్థలు పడేవారు. ఇక్కడి మిరపను హైదరాబాద్, గుంటూరు, నంద్యాల, వరంగల్, పూణే తదితర ప్రాంతాలకు ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి తీసుకెళ్లి విక్రయించేవారు. రవాణా ఖర్చులు మోయలేని భారంగా మారడంతో నానా ఇబ్బందులు పడేవారు. ఇదిలా ఉండగా, గుంటూరు, నంద్యాల ప్రాంతాల నుంచి కొంతమంది ఏజెంట్లు జిల్లాలోని ఆయా గ్రామాల రైతుల వద్దకు నేరుగా వచ్చి తక్కువ ధరలకు కొనుగోలు చేసి, వారు ప్రయోజనం పొందారు. రైతులు సైతం దూర ప్రాంతాలకు మిరపను తీసుకెళ్లలేక ఏజెంట్లకు విక్రయించి నష్టపోయారు.

ఈనామ్ పద్ధతిలో కొనుగోళ్లు

గద్వాల యార్డులో ఎండుమిర్చి కొనుగోళ్లకు మూడేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నారు. యార్డు వ్యాపారస్తులతో అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లు చేయాలని కోరారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ పాలకవర్గం, అధికారులు ప్రయత్నాలు కొనసాగించారు. ఈక్రమంలోనే కార్యరూపం దాల్చింది. ప్రస్తుతం మార్కెటింగ్ వ్యవస్థలో ఈనామ్ విధానం అమల్లో ఉంది. దీని ప్రకారం యార్డుకు రైతులు తీసుకొచ్చే పంట ఉత్పత్తులను ఏ ప్రాంతానికి చెందిన లైసెన్స్ కలిగిన ఖరీదుదారుడైన ధర కోడ్ చేసి కొనుగోలు చేయవచ్చు. అయితే ఈనామ్ విధానం ద్వార గద్వాల యార్డులో ఎండు మిర్చిని కొనుగోలు చేసేందుకు కర్నూల్ ప్రాంతానికి చెందిన ఖరీదుదారులు ముందుకు వచ్చారు. అధికారులు సైతం ఇందుకు సమ్మతించారు. ఆ వ్యాపారస్తులకు కొనుగోళ్లకు అవసరమైన ఐడీ ఇవ్వనున్నారు. ఇదే సమయంలో ఎండుమిర్చి కొనుగోళ్లకు గద్వాల యార్డు కమీషన్‌దారులు సైతం ముందుకు వచ్చారు. ఇలా అక్కడి ఖరీదుదారులు, ఇక్కడి కమీషన్‌దారులు కొనుగోళ్లకు ఏకతాటిపైకి రావడంతో కార్యరూపం దాల్చనుంది.

దళారులను ఆశ్రయించొద్దు



జిల్లాలో ఏటా ఎండు మిర్చి సాగు పెరుగుతోంది. మార్కెటింగ్ సౌకర్యం లేక రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించాం. దీనిని అధిగమించేందుకు పలు ప్రయత్నాలు చేశాం. వ్యాపారస్తులు సైతం ముందుకు రావడంతో సోమవారం నుంచి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నాం. రైతులు దళారులకు ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయించకుండా యార్డుకు తీసుకురావాలి.

– పుష్ప, జిల్లా మార్కెటింగ్ అధికారి

సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శం



మద్దూరులో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

మానవపాడు: రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, పల్లెల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే వీఎం.అబ్రహం అన్నారు. ఆదివారం మండలంలోని మద్దూరులో పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశానుసారం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో రైతులకు 24గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఇస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని పంటలకు తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా నీటిని అందిస్తామని, ప్రజలు వాస్తవాలను గమనించాలని, అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు. మద్దూరులోని పాఠశాలలో మన ఊరు– మనబడి కింద అభివృద్ధి పనులు చేపడుతుండగా వాటిని పరిశీలించారు. నాగేశ్వర్ రెడ్డి, మల్లికార్జున్, మహేంద్ర, అనిల్, గోకారి, ఈశ్వర్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

‘తుమ్మిళ్ల’ నుంచి నీరివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడి



ఆర్డీఎస్ ఈఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

రాజోళి/శాంతినగర్: తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి ఆర్డీఎస్ ఆయకట్టుకు 9వ తేదీలోగా నీరు వదలకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హెచ్చరించారు. రాజోళితోపాటు, వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో వేర్వేరుగా మాట్లాడారు. ఆదివారం తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆగిపోయిందని, దీంతో ఆయకట్టులో సాగుచేసిన పంటలు ఎండిపోతాయని, మూడు రోజుల్లో నీరివ్వకపోతే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఆర్డీఎస్ కెనాల్‌పై అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేసి నీరందించాలని డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టుకు ప్రాణం పోసేందుకే తుమ్మిళ్ల లిఫ్ట్ నిర్మించామని చెప్పుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయకట్టుకు సాగునీరందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మూడు రిజర్వాయర్లు నిర్మిస్తామని ఇప్పటివరకు నిర్మించకపోవడంతోనే సమస్య తలెత్తుతోందన్నారు. ఈవిషయమై ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటికే ఇండెంట్ పెట్టామని, మరో రెండు రోజుల్లో నీరు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారన్నారు. ఈ సారి విడుదలయ్యే నీటిని ప్రణాళిక ప్రకారం రైతులకు అందివ్వాలని, డీ–29 నుండి సరైన తడులు అందలేదని, గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్న చోట ప్రాధాన్యత కల్పిస్తూ నీరు పారించాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, నాగశిరోమణి, కుమార్, వెంట్రామన్, మల్లిఖార్జున్ గౌడ్, నాగరాజు గౌడ్ తదిదరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా పనిచేసే వారికే పదవులు



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్

వనపర్తి క్రైం: పార్లమెంట్, అసెంబ్లీ కోర్ కమిటీ సభ్యులుగా క్రియాశీలకంగా పనిచేసే వారిని నియమించాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ అన్నారు. పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశాన్ని ఆదివారం జిల్లాకేంద్రంలోని శ్రీలక్ష్మీకృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల కేంద్రాల్లో వారానికి ఒకసారి సమావేశం జరుపుకొని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీ నిర్మాణానికి బలమైన పునాదులు వేయాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని వెయ్యి ఇళ్లపై పార్టీ జెండాలు కనిపించాలని, ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, దేశరక్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రచారం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బూత్ కమిటీ నాయకులతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గాల వారీగా ధార్మిక పరిషత్, మఠాల పీఠాధిపతులు, ఆలయ కమిటీ, సాంస్కృతిక సభ్యులతో తరుచూ సమావేశాలు జరపాలని, అయోధ్యలో శ్రీరామచంద్రుడి ఆలయ నిర్మాణానికి తీసుకుంటున్న నిర్ణయాలను వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శ్రుతి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, జాతీయ ఖాదీబోర్డు అధ్యక్షుడు పేరాల శేఖర్, జాతీయ నాయకుడు సాంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, పార్లమెంటరీ ప్రభారి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్, నాయకులు జింకల కృష్ణయ్య, నారాయణ, రామన్‌గౌడ్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి సాహిత్య సేవలు

మహిళా దినోత్సవం కవి సమ్మేళనంలో వక్తలు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ చైతన్యానికి సాహిత్య సేవలు దోహదం చేస్తాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ, అక్షర కౌముది సాహితీ సామాజిక సంస్థ, వినాయక డెవలపర్స్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని శివానందాశ్రమంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం, ఉగాది కవి సమ్మేళనం అలరించింది. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, కవి సమ్మేళనం నిర్వహించడం అభినందనీయం అన్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టే వారికి తనవంతు ప్రోత్సాహం అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సనాతన సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించడానికి సాహిత్యం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పద్యకవి డాక్టర్ నలవోలు నర్సింహారెడ్డి, రావూరి వనజ, జి.శాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీఓఈ ప్రవేశ పరీక్ష



గట్టులో ప్రవేశ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఎర్రవల్లిచౌరస్తా/గట్టు: సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్ ప్రవేశానికి నిర్వహించిన సీఓఇ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఇటిక్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మొత్తం 650మంది విద్యార్థులకుగాను 626మంది హాజరు కాగా.. 24 మంది గైర్హాజరైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వెస్ట్ రీజియన్ కోర్డినేటర్ ఫ్లోరెన్స్ రాణి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అంజలి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గట్టు, మానవపాడులో..

గట్టు గురుకుల పాఠశాలలోని సెంటర్‌లో జరిగిన పరీక్షకు 650 మంది విద్యార్థులకుగాను 625 మంది హాజరయ్యారు. ఇక మానవపాడు సెంటర్‌లో 431కిగాను 403 మంది విద్యార్థులు హాజరయ్యారు.



ఇటిక్యాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఇన్‌చార్జ్‌లే దిక్కు..!

మున్సిపాలిటీల్లో వేధిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది కొరత

- ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న అధికార యంత్రాంగం
- ఒక్కొక్కరికీ రెండు, మూడు చొప్పున అదనపు బాధ్యతలు
- డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల నుంచి మరికొందరు..
- ఉమ్మడి జిల్లాలోని 19 పురాలదీ ఇదే పరిస్థితి



గద్వాల మున్సిపల్ కార్యాలయం

అచ్చంపేట: మున్సిపాలిటీల్లో కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చే విభాగాల్లో టౌన్ ప్లానింగ్ ముఖ్యమైంది. కానీ, ఈ విభాగంపై ఇటు పాలకవర్గాలు, అటు ఉన్నతాధికారులకు పట్టింపులేకుండా పోయింది. దీంతో పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్నారు. నాగర్‌కర్నూల్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి (డీటీసీపీఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన డీటీసీపీఓ శేఖర్ నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండటం గమనార్హం. అలాగే మహబూబ్‌నగర్‌కు చెందిన ఏసీపీఓ ప్రతాప్ వనపర్తి డీటీసీపీఓగా పనిచేస్తున్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీ టీపీఎస్ కుర్మయ్య గద్వాల డీటీసీపీఓగా డిప్యుటేషన్‌పై వచ్చారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో..

ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపాలిటీలు నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్, నారాయణపేట, మక్తల్, కోస్గి, వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూర్, అమరచింత, గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి టౌన్ ప్లానింగ్ విభాగంలో సరిపడా అధికారులు, సిబ్బంది లేరు. నాగర్‌కర్నూల్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలుండగా.. ఒక టీపీఓ, మరో టీపీఎస్‌తో నెట్టుకొస్తున్నారు. ఒక్కో అధికారి రెండు, మూడు మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతుండడంతో వారిపై పనిభారం పెరుగుతోంది. మున్సిపాలిటీలు ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జీలే దిక్కవుతున్నారు. ప్రతి మున్సిపాలిటీలో టీపీఓ, ఇద్దరు టీపీఎస్‌లు, నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ సర్వేలు, క్యాడ్ ఆపరేటర్లు, టౌన్ ప్లానింగ్ ట్రేసర్లు ఉండాలి. కానీ, ఇందులో ఒక్కరు కూడా సక్రమంగా లేకపోగా.. ప్రభుత్వం సైతం ఆయా ఖాళీలను భర్తీ చేయడానికి పూనుకోవడం లేదు.

జీతం అక్కడ.. ఉద్యోగం ఇక్కడ

కొందరు అధికారులు జీతం ఒకదగ్గర తీసుకుంటూ.. ఉద్యోగం మరో దగ్గర చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ టీపీఓ విజయ్‌కుమార్, టీపీఎస్ నరేష్‌లు డిప్యుటేషన్ మీద అచ్చంపేట, కల్వకుర్తి, జడ్చర్ల మున్సిపాలిటీల్లో పనిచేస్తున్నారు. సదరు ఉద్యోగులకు నాగర్‌కర్నూల్ నుంచే నెలనెలా వేతనాలు చెల్లిస్తున్నారు. జహీరాబాద్ మున్సిపల్ టీపీఎస్ కుర్మయ్య అక్కడ జీతం తీసుకుంటూ గద్వాల డీటీసీపీఓతోపాటు అలంపూర్, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీల్లో ఇన్‌చార్జ్ టీపీఓగా పనిచేస్తున్నారు.

అదనపు బాధ్యతలతో సతమతం

టౌన్‌ప్లానింగ్ అధికారుల పనితీరు కత్తిమీద సాములా మారింది. ఒక్కో అధికారికి రెండు, మూడు మున్సిపాలిటీల బాధ్యతలు అప్పగించడంతో పనిభారం సతమతమవుతున్నారు. నాగర్‌కర్నూల్ టీపీఎస్ నరేష్‌కు జడ్చర్ల మున్సిపాలిటీ టీపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే నాగర్‌కర్నూల్ టీపీఓ విజయ్‌కుమార్ అచ్చంపేట, కల్వకుర్తి మున్సిపాలిటీల ఇన్‌చార్జ్ టీపీఓగా వ్యవహరిస్తున్నారు. అయితే వీరు ఎక్కడా కూడా విధులకు న్యాయం చేయలేకపోతుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొల్లాపూర్ మున్సిపల్ టీపీఓ మనోజ పెబ్బేరు, కొత్తకోట మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. జహీరాబాద్ మున్సిపల్ టీపీఎస్ కుర్మయ్య ఓడీలో గద్వాల డీటీసీపీఓతో పాటు అలంపూర్, వడ్డేపల్లి, అయిజ మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్ టీపీఓగా పనిచేస్తున్నారు.

■ వనపర్తి టీపీఎస్ సుధాకర్ ఆత్మకూర్, అమరచింత టీపీఓగా, షాద్‌నగర్ మున్సిపాలిటీ టీపీఎస్ సురేష్‌కుమార్ భూత్పూర్, ఆమనగల్ మున్సిపాలిటీల బాధ్యతలు చూస్తున్నారు. నారాయణపేట మున్సిపల్ ఏఈ రాజునాయక్ ఇన్‌చార్జ్ టీపీఓగా కొనసాగుతున్నారు. కొండగల్ మున్సిపల్ టీపీఎస్ లాలప్ప మక్తల్, కోస్గి ఇన్‌చార్జ్ టీపీఓగా ఉన్నారు.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం



మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ఉంది. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఈ సమస్య అధికంగా ఉంది. దీంతో చాలా పనులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది కొరత లేకుండా పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయించాలని కోరాం. నూతన రిక్రూట్‌మెంట్‌లో పూర్తి స్థాయిలో సిబ్బందిని కేటాయిస్తామని చెప్పారు.

– బీఎస్ కేశవ్, మున్సిపల్ చైర్మన్, గద్వాల

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్: ట్రాక్టర్ పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నవాబుపేట మండలం కారూర్ చెందిన కృష్ణయ్య (32) శనివారం సాయంత్రం ట్రాక్టర్‌పై బాలానగర్ మండలం నేరళ్లపల్లి వెళ్తుండగా తిర్మలాపూర్ శివారులో రోడ్డుపై పంది అడ్డు రావడంతో తప్పించబోయి చెట్టును ఢీకొన్నాడు. దీంతో కృష్ణయ్య తీవ్ర గాయాలయ్యాయి. షాద్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని చర్లపల్లి చెందిన వల్ల బుదాస్ శాలిని అదృశ్యమైనట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. యువతి ఈనెల 3న పట్టణంలోని కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. యువతి తండ్రి అశోక్‌గౌడ్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా గ్రామానికి చెందిన యువకుడిపై తమకు అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొనడంతో ఆ దిశగా విచారిస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

ఇంటికి నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని చుక్కాయపల్లిలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి నిప్పంటించారు. ఎస్ఐ బాలవెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి కృష్ణయ్య, కుటుంబ సభ్యులు శనివారం రాత్రి 9గంటలకు ఇంట్లో నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తగులబడి మంటలు వస్తుండగా అది గమనించిన అందరూ బయటకు వచ్చారు. కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.
ఇదిలా ఉండగా నాలుగు నెలల క్రితం కృష్ణయ్య కుమారుడు బాలరాజు గ్రామానికి చెందిన అమ్మాయిని ప్రేమించాడు. వివాహం కూడా చేసుకున్నాడు. గ్రామ పెద్దలు ఇద్దరిని విడదీయంతో అమ్మాయి తన తల్లిగారి ఇంటి వద్దనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని కుమ్మరి కృష్ణయ్య ఇంటి ముందుంచి ధర్నా చేశారు. పెద్దలు కల్పించుకుని వారి నుంచి కొంత భూమిని అమ్మాయి తలిదండ్రులకు రాసి ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది. వారే మా ఇంటికి నిప్పు పెట్టి చంపాలని చూశారని కుమ్మరి కృష్ణయ్య ఆరోపించారు.

సారా పట్టివేత

బల్మూర్: మండలంలోని అనంతవరం–నర్సాయపల్లి రహదారిలో ఆదివారం సారా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐలు బాలరాజు, సతీష్‌కుమార్ తెలిపారు. అనంతవరం చెందిన రాములు 10 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా నిందితుడు తమను గమనించి ద్విచక్రవాహనాన్ని వదిలి పారిపోయినట్లు వారు తెలిపారు.

గడ్డివాము దగ్ధం



వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో బోయిన్‌పల్లి నిరంజన్‌గౌడు చెందిన గడ్డివాము ఆదివారం దగ్ధమైంది. రైతు పశుగ్రాసం కోసం 3ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచారు. పొలంలో ఉన్న విద్యుత్ వైర్లకు నిప్పురవ్వలు రావడంతో పక్కనే ఉన్న గడ్డివాముపై పడ్డాయి. దీంతో పూర్తిగా కాలిపోయింది. వీటి విలువ దాదాపుగా రూ.50వేల వరకు ఉంటుందన్నారు.

కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లితండాలో కుక్కల దాడిలో తొమ్మిది మేక పిల్లలు మృతి చెందాయి. తండాకు చెందిన రైతు చందర్‌నాయక్ తన ఇంటి వద్ద మేక పిల్లలు కట్టి మిగతా మేకలను మేత కోసం అడవికి తీసుకెళ్లాడు. ఆదివారం పట్టపగలు ఎవరూ లేని సమయం చూసి కుక్కలు మేక పిల్లలపై దాడి చేశాయి. మేక పిల్లల మృతితో చందర్‌నాయక్‌కు రూ. 60వేల నష్టం వాటిల్లింది. తనకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు ప్రభుత్వాన్ని కోరారు.

సమీకృత మార్కెట్‌కు మోక్షమెప్పుడు?

- అరకొర స్థలంలో నిర్మాణం
- పునాదులకే పరిమితమైన పనులు
- కూరగాయల విక్రయాలకు ఇబ్బందులు



పునాదులకే పరిమితమైన సమీకృత మార్కెట్ యార్డు

జడ్చర్ల: మున్సిపాలిటీలో ప్రభుత్వం రెండేళ్ల కిందట సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. దీంతో ప్రజలకు కావాల్సిన చికెన్, మటన్, చేపలు, పండ్లు, పూలు, పాలు ఒకే చోటు కొనేందుకు వీలవుతుంది. అంతేగాక ఆయా ప్రాంతాలకు తిరగాల్సిన పని కూడా తప్పుతుంది. ఇందులో భాగంగా సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు, పాలకులు కసరత్తు చేసి చివరకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న స్థలాన్ని ఎంపిక చేశారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మార్కెట్ పనులకు ఆరు నెలల కిందట శంకుస్థాపన చేశారు. అయితే ఈ పనులు పునాదులకే పరిమితమయ్యాయి.

సరిపడని స్థలం

మార్కెట్ యార్డు కొనసాగేందుకు కనీసం రెండు ఎకరాల స్థలం అవసరం ఉంది. కొనుగోలుదారులకు వీలుగా వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ ఏర్పాటు చేస్తున్న మార్కెట్‌కు అంత స్థలం అందుబాటులో లేకపోయింది. భూమి విలువ అధికంగా ఉండటంతోపాటు పట్టణ ప్రజలకు సౌకర్యంగా అనువైన స్థలం లేకపోవడంతో చివరకు మండల పరిషత్, మండల మహిళా సమాఖ్య, ఎమ్మార్సీ, వ్యవసాయ శాఖ కార్యాలయాలు కొనసాగుతున్న ప్రాంగణ స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ స్థలంలో కూడా పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాలకు చెందిన భవనాలు ఉండగా వాటిని కూల్చివేసి మార్కెట్‌కు అనుకూలంగా చదును చేసి పనులు చేపట్టారు. అయినా స్థలం సరిపోవడం లేదు.

కోర్టు స్థల సేకరణకు చర్యలు

ఇదే ప్రాంగణంలో ఒక దిక్కుగా కొనసాగుతున్న కోర్టును తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారికి దగ్గరగా మండల పరిషత్ కార్యాలయం ముందు భాగంలో కోర్టు భవనాన్ని నిర్మించేందుకు వీలుగా అధికారులు, పాలకులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇక్కడ కోర్టు భవనం పూర్తయితే ప్రస్తుతం నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌కు అనుగుణంగా కోర్టు స్థలాన్ని సేకరిస్తే కొంత మేలు కలిగే అవకాశం ఉంది.

> **నాలుగు నెలల్లో పూర్తిచేస్తాం**
>
> సమీకృత మార్కెట్ యార్డు పనులను నాలుగు నెలల్లో పూర్తి చేస్తాం. కోర్టు భవనాన్ని తరలించిన తర్వాత ఆ స్థలాన్ని కూడా స్వాధీనపర్చుకుని మార్కెట్ యార్డుకు అనుగుణంగా విస్తరిస్తాం. పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.– మహ్మద్ షేక్, కమిషనర్, జడ్చర్ల మున్సిపాలిటీ

క్రయవిక్రయాలకు ఇక్కట్లు

పట్టణంలో కూరగాయల క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడుతున్నారు. అమ్మకందారులు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూరగాయలను తీసుకువచ్చే రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. నేతాజీ చౌరస్తాలో కూరగాయల విక్రయాలు అప్పుడప్పుడు సాగుతుంటాయి. ఇక్కడ ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడం, కూరగాయల అమ్మకాలు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో మున్సిపల్ అధికారులు అనుమతించడం లేదు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు రహదారిని అనుసరించి ప్రస్తుతం క్రయవిక్రయాలు సాగుతున్నాయి. కానీ, ఇక్కడ మార్కెట్‌కు పంట దిగుబడుల రాక తరలింపు వలన వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అంతేగాక రైల్వే రేక్ పాయింట్ నుంచి ఫర్టిలైజర్ బస్తాల తరలింపు కూడా ఇదే రహదారి గుండా కొనసాగుతుంది. దీంతో కూరగాయల క్రయవిక్రయాలకు అవరోధం ఏర్పడుతుంది. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ మూతపడింది. అనుకూలంగా లేకపోవడంతో అటువైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు. దీంతో రైతుబజార్ కథ కంచికి చేరింది.

ప్రవేశాలపై స్పష్టత కరువు

- మెయిన్ స్టేడియంలో ఏర్పాటైన వాలీబాల్ అకాడమీ
- ఎంపిక చేసి మూడు నెలలు అవుతున్నా ప్రవేశం పొందని క్రీడాకారులు



వాలీబాల్ అకాడమీ కోర్టులు

మహబూబ్‌నగర్ క్రీడలు: ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో జిల్లా స్టేడియంలో ఉన్న వాలీబాల్ అకాడమీ తిరిగి ఏర్పాటైంది. రాష్ట్రంలోనే జిల్లాకు క్రీడల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ముఖ్యంగా వాలీబాల్ క్రీడల్లో జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో ఎక్కడ టోర్నీ నిర్వహించినా సత్తా చాటేవారు. 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ నడిచిన నాలుగేళ్లలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ చాటారు. అకాడమీలో శిక్షణ పొందిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. వీరు మొదట్లో అకాడమీలో వాలీబాల్‌లో ఓనమాలు నేర్చుకొని దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఇదే అకాడమీలో శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిధుల నిర్వహణ భారంతో 2008లో వాలీబాల్ అకాడమీని మూసివేశారు.

మంత్రి చొరవతో తిరిగి ఏర్పాటు

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో వాలీబాల్ అకాడమీ తిరిగి ఏర్పాటైంది. రూ.19లక్షల 70వేల నిధులతో ఏర్పాటు చేశారు. స్టేడియం ఆవరణలో గల స్విమ్మింగ్‌ఫూల్‌లోని అంతస్తుల గదులను క్రీడాకారుల వసతి కోసం కేటాయించారు. గదుల ఆధునీకరణ పనులు చేపట్టారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తీసేసి వాటి స్థానంలో కొత్త కోర్టులు, వాటి చుట్టూ నాలుగు ఫ్లడ్‌లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ ఏర్పాటు చేశారు. గోడ చుట్టూ ఆకర్షణీయంగా క్రీడా చిత్రాలను తీర్చిదిద్దారు.

ఔత్సాహిక క్రీడాకారులకు మహర్దశ

అకాడమీ ఏర్పాటుతో ఔత్సాహిక క్రీడాకారులకు మహర్దశ కలగనుంది. అకాడమీకి ప్రత్యేక సెలక్షన్స్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన 20 మంది బాలుర, 20 బాలికలకు ప్రవేశం లభిస్తుంది. నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో వాలీబాల్‌లో మెరుగైన శిక్షణ అందజేసి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచేలా క్రీడాకారులను తీర్చిదిద్దుతారు. అకాడమీకి ఎంపికైన వారికి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు.

క్రీడాకారుల ఆందోళన

జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం గతేడాది డిసెంబర్ 1న రాష్ట్రంలోని 14–18 ఏళ్ల మధ్య బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించారు. మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు ప్రవేశాలు కల్పించలేదు. దీంతో సీనియర్ క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రవేశాలు కల్పించాలని కోరుతున్నారు.

> **త్వరలో అవకాశం**
>
> 
>
> జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ఏర్పాటైంది. అకాడమీ ఏర్పాటుతో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీయవచ్చు. క్రీడాకారులకు ప్రవేశాలకు సంబంధించి సెలక్షన్స్ నిర్వహించాం. శాట్ ఆదేశాల మేరకు త్వరలో అకాడమీలో ప్రవేశాలు కల్పిస్తాం.
> – ఎస్. శ్రీనివాస్, డీవైఎస్ఓ, మహబూబ్‌నగర్



అకాడమీ ప్రవేశాల కోసం నిర్వహించిన సెలక్షన్స్‌కు హాజరైన క్రీడాకారులు(ఫైల్)

కంపెనీ ఎదుట వంటావార్పుతో నిరసన



కంపెనీ ఎదుట వంటలు చేస్తున్న మహిళలు

మరికల్: ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్తులు వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ప్రజల పార్టీ అధ్యక్షుడు మురళీధర్‌గుప్త, కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ నుంచి 54 గ్రామాలకు ప్రమాదం ఉండటంతో కంపెనీ రద్దు కోరుతూ 11 రోజులు, 174 కిలో మీటర్లు పాదయాత్ర చేసి ప్రజలను చైతన్య పరిచినట్లు తెలిపారు. కంపెనీ యాజమాన్యం చేసే కుట్రలతో పాటు దాని రద్దు కోసం భవిష్యత్ కార్యచరణపై ప్రణాళికను రూపొందించామని తెలిపారు. కంపెనీ ప్రారంభమైతే మండలంలో 17 గ్రామాలతో పాటు కోయిల్‌సాగర్, మన్నెవాగు పరివార గ్రామాలకు కూడా కాలుష్యపరమైన ముప్పు ఉందన్నారు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా కదిలి వస్తే కంపెనీ యాజమాన్యంను ఎదుర్కొవడం పెద్ద సమస్య కాదన్నారు. ప్రశాంతంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించి ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలయ్య, నాయకులు వంశీకృష్ణ, సూర్యనారాయణ, శ్రీనివాస్, లక్ష్మయ్య, నాగేష్, యాదగిరి, మహదేవ్, మోహనకృష్ణ, లింగన్న, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న గ్రామస్తులు

వందమంది పోలీసుల బందోబస్తు


కంపెనీ ఎదుట గ్రామస్తులు నిర్వహించిన కార్యక్రమంలో ముందు జాగ్రత్తగా వంద మంది పోలీసులను బందోబస్తు నిర్వహించారు. మరికల్, మక్తల్ సీఐలతో పాటు 8 మంది ఎస్ఐలు, వంద మంది పోలీసులను వచ్చారు.

రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.97.2 కోట్లు మంజూరు

- సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: జిల్లాలోని గణప సముద్రం, బుద్ధారం చెరువులను రిజర్వాయర్లుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గణప సముద్రానికి రూ.55 కోట్లు, బుద్దారం చెరువుకు రూ.42.2 కోట్లు కేటాయించారని.. రూ.97.2 కోట్ల అంచనాలతో త్వరలో టెండర్లు పిలువనున్నామని పేర్కొన్నారు. తాను ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసినప్పుడే అంచనాలు సిద్ధం చేయించి పరిపాలన అనుమతి కోసం ప్రభుత్వానికి నివేదించానని.. పలుమార్లు మార్పులు, చేర్పుల అనంతరం ఈ నెల రెండో తేదీన అనుమతి లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు చేసిన స్థలం

రాజాపూర్: మండలంలోని తిర్మలాపూర్ శివారులోని నేరళ్లపల్లి మైసమ్మ దేవాలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. ఆదివారం ఉదయం గ్రామానికి చెందిన భక్తులు మైసమ్మ దర్శనం కోసం వెళ్లగా విగ్రహం తొలగించి తవ్వకాలు చేసిన విషయాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో దేవాలయ పరిసరాలను పరిశీలించి గుప్త నిధుల కోసం తవ్వకాలు చేసినట్లు నిర్ధారణకు వచ్చారు.

మద్యం మత్తులో పాఠశాలలో వీరంగం



పాఠశాలలో బోయ బడేసాబ్

గట్టు: మద్యం మత్తులో ఓ వ్యక్తి పాఠశాలలోకి ప్రవేశించి, ఒకటవ తరగతి చదువుకుంటున్న తన కూతురికి కనీసం రాయడం, చదవడం రావడం లేదంటూ ఉపాధ్యాయులను దూషిస్తూ, వీరంగం సృష్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే మండలంలోని బోయలగూడెం చెందిన బోయ బడేసాబ్ కూతురు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతుంది. శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బోయ బడేసాబ్ మద్యం మత్తులో పాఠశాలకు చేరుకున్నాడు. తన కూతురు పలకను తీసుకుని ఏం చదువులు చెబుతున్నారంటూ అక్కడి కుర్చీని నేలకేసి కొట్టాడు. అంతటితో ఆగకుండా ఉపాధ్యాయులను దూషించాడు. తన కూతురికి రాయడం, చదవడం రావడం లేదంటూ ఉపాధ్యాయులపై అనుచితంగా ప్రవర్తించాడు. పదవ తరగతి విద్యార్థులు విషయాన్ని గమనించి ఆయనను శాంతింపచేయడానికి ప్రయత్నించగా, చేతిలోని పలకతో విద్యార్థిని కొట్టాడు. ఉపాధ్యాయులు గ్రామస్తులకు సమాచారం అందించడంతో గ్రామ పెద్దలు కొందరు పాఠశాలకు చేరుకుని ఆయనను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయం గురించి హెడ్మాస్టర్ రజియాబేగంను వివరణ కోరగా బోయ బడేసాబ్ మద్యం మత్తులో పాఠశాలలోకి ప్రవేశించి, ఇష్టానుసారంగా దూషించినట్లు తెలిపారు. ఈ సంఘటనతో తాము ఆందోళనకు గురైనట్లు పేర్కొన్నారు.

ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలదాడి



గాయపడిన అమన్

జడ్చర్ల: ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచిన సంఘటన ఆదివారం బాదేపల్లిలోని నిమ్మబాయిగడ్డ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఫసల్‌బండ కాలనీలో ఇంటి ముందు ఆడుకుంటున్న అమన్‌పై వీధి కుక్కలు ఆకస్మికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు కర్రతో కుక్కలను తరిమికొట్టడంతో బాలుడు ప్రాణాపాయం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. వెంటనే బాలుడిని తల్లిదండ్రులు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కుక్కలను తరమకపోతే తమ కుమారుడిని పొట్టన పెట్టుకునే పరిస్థితి ఉండేదని బాలుడి తండ్రి మన్నన్ ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సంఘటన తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ బాలుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పట్టణంలో కుక్కల బెడదను నివారించడంలో స్థానిక మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు కాకముందే నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



బోల్తాపడిన ట్రాక్టర్

అయిజ: ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయట పడిన సంఘటన మండలంలోని భైనిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ట్రాక్టర్‌లో మొరం తీసుకొచ్చేందుకు డ్రైవర్ రెహమాన్ భైనిపల్లి నుంచి అయిజకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎదురుగా మరో ట్రాక్టర్ రావడంతో సైడ్ ఇచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాద నుంచి బయటపడ్డాడు.

పొలెంలో జింక కళేబరం



జింక కళేబరం

బిజినేపల్లి: మండలంలోని పాలెం చెందిన పశువైద్య కేంద్రం సమీపంలో అనుమానాస్పద స్థితిలో జింక కళేబరం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం పశువైద్య కేంద్రం సమీపంగా వెళ్లిన గ్రామస్తుల కంటపడింది. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే గ్రామానికి జింకలు వచ్చే అవకాశం లేదని, ప్రధార రహదారికి సమీపంలో జింక కళేబరం లభ్యం కావడంపై అనుమానాలు చోటు చేసుకున్నాయి. ఎవరైన జింకను చంపి ఇక్కడ వేశారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బతుకులు మారాలంటే బీఎస్పీకి ఓటేయండి

- రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



పార్టీలో చేరిన యువకులతో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఉండవెల్లి: యువకులకు ఉద్యోగాలు.. రైతులకు సాగునీరు.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చి బతుకులు మారాలంటే బీఎస్పీకి ఓటు వేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని విద్యార్థులు చదువుకోవడానికి వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేని నియోజకవర్గం ఇదేనన్నారు. రైతులకు ఆర్డీఎస్ నీరు రాక మొక్కజొన్న పంట ఎండిపోతున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రజకులకు నిధులు మంజూరు చేస్తామని చెప్పి, మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారని విమర్శించారు.
మండలంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో అద్దె భవనంలో నిర్వహించడం బాధాకరమన్నారు. దళితబంధు, రైతుబంధు డబ్బున్న వారికే వర్తిస్తుందని పేర్కొన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో సమస్యలు పట్టించుకోకుండా, కమీషన్లకు స్థానిక ఎమ్మెల్యే పరిమితమవుతున్నాడని ఆరోపించారు. రాజేంద్రనగర్‌కు చెందిన 10 మంది యువకులు పార్టీలో చేరడంతో వారికి అభినందనలు తెలిపారు. మునుగోడుకు చెందిన శంకర్‌ఆచారి మాట్లాడుతూ.. బీసీ వర్గానికి సీటు ఇచ్చి నైతికంగా గెలిచిన పార్టీగా బీఎస్పీ ఉందన్నారు. అన్ని పార్టీల్లో అగ్రవర్ణాల ప్రజలు ఉంటే కేవలం బీఎస్పీలో మాత్రం బీసీలకు సీట్లు ఇవ్వడం ఆలోచించాల్సిన విషయమన్నారు. రాష్ట్ర మహిళా కన్వీనర్ రాణి మాట్లాడుతు రాజ్యాంగాన్ని మార్చుతాననడం చాలా బాధాకరమని, అలా మారిస్తే మన పరిస్థితి చూడలేమన్నారు. జీవో నంబర్ 98 శ్రీశైలం ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంతానికి ఒక్క పైసా కూడా రాలేదని అన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల వారికి ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని మోసపూర్తి హామీలు ఇచ్చారన్నారు. 56 గ్రామాలు నీట మునిగితే, అందులో 13 గ్రామాలు అలంపూర్ నియోజక వర్గంలోనే ఉన్నాయన్నారు. మన ఊరు మన బడిలో భాగంగా పాఠశాల నిర్మాణాలకు రూ.3,498 కోట్ల నిధులు విడుదల చేస్తామని చెప్పి కేవలం రూ.300 కోట్ల మంజూరు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. కార్యక్రమంలో బషీర్, అయ్యన్న, ఖాజా, ఈశ్వర్, శివ, ప్రభుదాసు, శేఖర్, కేశవులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు సాగాలి


ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని సత్కరిస్తున్న ఎస్పీ శైలజ, సముద్రాల వేణుగోపాలచారి

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయాలకు అతీతంగా బ్రాహ్మణ సామాజికవర్గం ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే ప్రాధాన్యం లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి అభ్యర్థి ఎక్కడ పోటీ చేసినా గెలిపించడానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్‌లోని కాతేరు వద్ద వెంకటాద్రి గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు ఆదివారం జరిగింది. తెలంగాణ ఎమ్మెల్సీ, మాజీ ప్రధాని పీవీ కుమార్తె సురభి వాణీదేవి, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, శ్రీశక్తి పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి మాతాజీ శ్రీ రమ్యానంద భారతి, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సత్యవాడ దుర్గాప్రసాద్, కోనూరు సతీష్‌శర్మ, కోశాధికారి హెచ్‌కే మనోహర్, రాష్ట్ర మహిళాధ్యక్షురాలు రెంటచింతల దీప్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ తోలేటి శిరీష తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ మద్దతు అమోఘం

- అందుకే మా పెట్టుబడులను ఇక్కడే భారీగా విస్తరిస్తున్నాం
- జీఐఎస్ వేదికగా ప్రపంచానికి చాటిచెప్పిన పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికే వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు తమ భారీ విస్తరణ ప్రణాళికలను ప్రకటించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై తమకున్న విశ్వాసాన్ని గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు వేదికగా ప్రపంచానికి చాటిచెప్పారు. విశాఖలో జరిగిన రెండ్రోజుల జీఐఎస్ సదస్సులో కొత్త పరిశ్రమలు, పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకోవడమే కాకుండా ఇప్పటికే కార్యకలాపాలు కొనసాగిస్తున్న వివిధ సంస్థలు తమ భారీ విస్తరణ కార్యక్రమాలను ప్రకటించాయి. రిలయన్స్ గ్రూపు దగ్గర నుంచి కొత్త తరం నోవా ఎయిర్ సంస్థ వరకు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందిస్తున్న తీరును సభా వేదికగా కీర్తించాయి. అంతేకాక.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి రండి అంటూ ఇతర పారిశ్రామికవేత్తలను ఆయా సంస్థల అధిపతులు ఆహ్వానించడం విశేషం. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఆయిల్ అండ్ గ్యాస్, టెలికాం, రిటైల్ వంటి వ్యాపారాల్లో ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టామని.. ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న మద్దతుతో మరో రూ.50,000 కోట్లతో 10 గిగావాట్ల రెన్యువబుల్ సోలార్ ఎనర్జీ పార్కును ఏర్పాటుచేస్తున్నట్లు ప్రకటించారు.

అదానీ మరో రూ.43,664 కోట్లు

అలాగే.. అదానీ గ్రూపు పోర్టులు, సిమెంట్ వంటి రంగాల్లో రాష్ట్రంలో సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు పెట్టగా భవిష్యత్తులో ఆయా రంగాల్లో సామర్థ్యాన్ని రెట్టింపు చేయనున్నట్లు ఏపీ సెజ్ సీఈఓ కరణ్ అదానీ ప్రకటించారు. రాష్ట్రంలో డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీతో పాటు వివిధ



రంగాల్లో రూ.43,664 కోట్ల పెట్టుబడులను పెట్టే విధంగా అదానీ గ్రూపు ఒప్పందం కుదుర్చుకుంది. ఇక లాక్‌డౌన్ కాలంలో తక్కువ సమయంలో యూనిట్‌ను ప్రారంభించామని, దీనికి రాష్ట్ర మద్దతే కారణమని నోవా ఎయిర్ సీఈఓ, ఎండీ గజానన్ నంబియార్ స్పష్టంచేశారు. సాధారణంగా ఆక్సిజన్ వంటి పారిశ్రామిక వాయువుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేయడానికి కనీసం 18 నుంచి 24 నెలల సమయం పడుతుందని, కానీ కేవలం 14 నెలల కాలంలోనే యూనిట్‌ను ప్రారంభించి వేలాది మంది జీవితాలను కాపాడినట్లు ఆయన తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్లు

జిందాల్ స్టీల్ పవర్ చైర్మన్ నవీన్ జిందాల్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో ఏపీ పారిశ్రామిక రాష్ట్రంగా ఎదగనుందన్నారు. అందుకే తన సోదరుడికి చెందిన జేఎస్‌డబ్ల్యూ రూ.50,632 కోట్ల పెట్టుబడులు పెడుతోందన్నారు. ఇక, ఇతర రాష్ట్రాలతో పోటీపడి ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ పార్కును దక్కించుకుంది. దీనితో రాష్ట్రంలో ఫార్మా రంగం మరింతగా విస్తరించనుంది. సాధారణంగా ఫార్మా పరిశ్రమ స్థాపనకు మూడు నుంచి నాలుగేళ్లు పడుతుందని, కానీ అన్ని అనుమతులున్న బల్క్ డ్రగ్ పార్కులో తక్షణం

సంస్థ	పెట్టుబడి (రూ.కోట్లల్లో)	ఉపాధి
ఎన్టీపీసీ	2,35,000	77,000
జేఎస్‌డబ్ల్యూ	50,632	9,500
రిలయన్స్	50,000	10,000
అదానీ గ్రూపు	43,664	53,815
హెచ్‌పీసీఎల్	14,320	1,500
అరబిందో	10,365	5,250
ఆదిత్య బిర్లా	9,300	2,850
ఐటీసీఎల్	4,300	1,500
సన్నీ ఆప్టెక్	2,500	2,000
అల్ట్రాటెక్	2,500	2,000
ఆంధ్రా పేపర్	2,000	2,300
మాండలీజ్	1,600	150
లారస్ గ్రూపు	1,210	1,700
దివీస్	1,100	3,700
సెల్‌కాన్ రిజల్యూట్	1,000	5,000

కార్యకలాపాలు మొదలుపెట్టే అవకాశం కలుగుతుందని దివీస్ ఫార్మా వైస్ ప్రెసిడెంట్ మధుబాబు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా రంగానికి ఇస్తున్న మద్దతుతో తాము మరింతగా కార్యకలాపాలు విస్తరించడానికి రూ.వేల కోట్లు ఇన్వెస్ట్ చేస్తున్నట్లు దివీస్, లారస్, హెటిరో, అపోలో తదితర సంస్థలు ప్రకటించాయి. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేస్తున్న సంస్థలు ఇలా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెళ్లిపోతున్నాయంటూ తెలుగుదేశంతో పాటు దాని అనుబంధ పత్రికల దుష్ప్రచారానికి తెరపడుతుందని భావిస్తున్నట్లు పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానిస్తున్నారు.

వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ..

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పెరిగిన విశాఖ ఇమేజ్
- నగర అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకదృష్టి



సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలో ఓవైపు కడలి కెరటాలు.. మరోవైపు పెట్టుబడులు పోటెత్తాయి. బెస్త గ్రామం నుంచి మహానగరంగా మారిన విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్). పరిపాలన రాజధానిగా కాబోతున్న నేపథ్యంలో వైజాగ్.. ఓ బ్రాండ్ సిటీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ నగరానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. సదస్సు విజయవంతం అయిన తర్వాత 'దేశానికి ఆర్థికకోట విశాఖ..' అని అందరి నోటా ఒకే మాట. జీఐఎస్–2023తో పెట్టుబడుల స్వర్గధామంగా సరికొత్త ఇమేజ్‌కు నాంది పలికిన వైజాగ్.. ఇదే స్ఫూర్తితో జీ–20 సదస్సుకు సిద్ధమవుతోంది. రాజధానులెన్నింటికో రాదారిగా ఉన్న విశాఖపట్నాన్ని పరిపాలన రాజధానిగా మార్చాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం సిద్ధించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చోదకశక్తి కేంద్రాలుగా మారుతున్న ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల జాబితాలో అగ్రభాగంలో ఉన్న విశాఖపట్నంలో రెండురోజులు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయింది. ప్రణాళికాబద్ధంగా నిర్మితమైన నగరంగా విశాఖకు ఈ సమ్మిట్ నిర్వహణతో అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. గత ప్రభుత్వ హయాంలో మూడుమార్లు పెట్టుబడుల సదస్సులు నిర్వహించినా రాని ఇమేజ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటిసారి ఏర్పాటు చేసిన జీఐఎస్‌తో వైజాగ్ పేరు ఖండాంతరాలు దాటింది. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నిర్వహించిన సమ్మిట్‌కు దేశవిదేశాలకు చెందిన దిగ్గజ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు హాజరై విశాఖ నగర వైభవానికి వావ్ అన్నారు.

కొత్త ఇమేజ్ తీసుకొచ్చారు

ఇన్నాళ్లు.. విశాఖపట్నం అంటే అలల సవ్వడులతో.. అందాల నగరంగా.. పర్యాటక ప్రాంతంగా మాత్రమే గుర్తింపు ఉండేది. కానీ.. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహించిన తర్వాత నగరానికి సరికొత్త ఇమేజ్ వచ్చింది. ఎవరు వచ్చినా ఆహ్వానించదగ్గ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న విశాఖ నగరంలో తమ వ్యాపార కార్యకలాపాలు విస్తరించాలన్న ఆలోచనల్ని పారిశ్రామికవేత్తలు స్వయంగా చూసిన తర్వాత మరింత బలపరుచుకున్నారు. నివాసయోగ్య నగరాల్లో టైర్–1 సిటీలతో పోటీపడుతున్న విశాఖపట్నం పెట్టుబడులకు కూడా ప్రధాన కేంద్రంగా మారింది. హైదరాబాద్‌ని మించి అభివృద్ధి చేసే అవకాశాలున్నప్పటికీ.. గత పాలకులు విశాఖని ఒక నగరంగానే గుర్తించి విస్మరించడంతో అనుకున్న మేర అభివృద్ధి చెందలేదు. కానీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపై ప్రత్యేకశ్రద్ధ వహించారు. నగరానికి కొత్త ఇమేజ్ తీసుకొచ్చేందుకు ఆలోచనలు కార్యరూపం దాల్చేలా అడుగులు వేశారు. అనుకున్నట్లుగానే పెట్టుబడుల సదస్సుతో 'తింటే గారెలే తినాలి.. వింటే భారతం వినాలి.. ఉంటే వైజాగ్‌లోనే ఉండాలి.. చేస్తే విశాఖలోనే వ్యాపారం చేయాలి..' అనే స్థాయికి తీసుకెళ్లారు.

మానవ తప్పిదమే

- డయాఫ్రమ్ వాల్ డ్యామేజ్‌పై తేల్చేసిన ఎన్‌హెచ్‌పీసీ
- చంద్రబాబు నిర్వాకాలు తేటతెల్లం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరంపై చంద్రబాబు సర్కారు అనాలోచిత నిర్ణయాలు.. ప్రణాళికా రాహిత్యం.. కమీషన్ల దాహంతోనే డయాఫ్రమ్ వాల్ దెబ్బ తిందని ఆది నుంచి చెబుతున్న వాస్తవాలను ఎన్‌హెచ్‌పీసీ నివేదిక అధికారికంగా ధ్రువీకరించింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా అప్రోచ్ చానల్, స్పిల్‌వే, స్పిల్ చానల్, పైలట్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా టీడీపీ సర్కారు ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో 1,750 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడం ఘోర తప్పిదమని నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) రాష్ట్ర జలవనరుల శాఖకు సమర్పించిన నివేదిక తేల్చి చెప్పింది. ఆ మానవ తప్పిదం వల్లే 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి.. ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడంతో ఖాళీ ప్రదేశం 800 మీటర్లకు కుచించుకుపోయి ప్రవహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది వరద ఉద్ధృతి తీవ్రతరం కావడానికి దారితీసింది. అందువల్లే ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గ్యాప్–1లో 35 మీటర్లు, గ్యాప్–2లో 20 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయని స్పష్టం చేసింది. గ్యాప్–2లో డయాఫ్రమ్ వాల్ ఎడమ వైపున 175 మీటర్ల నుంచి 363 మీటర్ల వరకు ధ్వంసం కాగా కుడి వైపున 1,170 నుంచి 1,370 మీటర్ల వరకు పూర్తిగా ధ్వంసమైందని తేల్చింది. 480 మీటర్ల నుంచి 510 మీటర్ల వరకు, 950 మీటర్ల నుంచి 1,020 మీటర్ల వరకు రెండు చోట్ల 20 మీటర్ల లోతు వరకూ డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని తేల్చింది. ఫలితంగా భూగర్భంలో గోదావరి ప్రవాహాన్ని సమర్థంగా అడ్డుకట్ట వేయలేదని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను పటిష్టం చేసే చర్యలు చేపడితేనే లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని తెలిపింది.

ఎన్‌హెచ్‌పీసీ సమగ్ర అధ్యయనం..

పోలవరం వద్ద భౌగోళిక పరిస్థితుల రీత్యా వరద ప్రవాహాన్ని మళ్లించే స్పిల్‌వేను నదీ తీరానికి కుడి వైపున రాతి నేలపై, 194.6 టీఎంసీలను నిల్వ చేసే ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్‌ను నదికి అడ్డంగా నిర్మించేలా కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ప్రాజెక్టు డిజైన్‌ను ఆమోదించింది. ప్రధాన డ్యామ్‌కి పునాదిగా డయాఫ్రమ్ వాల్ వేయాలని పేర్కొంది. డయాఫ్రమ్ వాల్‌ను నిర్మిస్తేనే భూ గర్భంలో గోదావరి ప్రవాహం ఎగువకు నుంచి దిగువకు, దిగువ నుంచి ఎగువకు వెళ్లకుండా అడ్డుకుంటుంది. అంటే లీకేజీ (ఊట నీరు)కి పూర్తిగా అడ్డుకట్ట వేస్తుంది. ఇది ప్రధాన డ్యామ్ చెక్కు చెదరకుండా కాపాడుతుంది. ప్రధాన డ్యామ్‌కు అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్‌ను గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించే పనులు పూర్తి చేశాకే చేపట్టాలి. గత సర్కారు అనాలోచితంగా అందుకు విరుద్ధంగా చేపట్టడంతో 2019లో వచ్చిన వరద ఉద్ధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఈ క్రమంలో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ సామర్థ్యాన్ని తేల్చేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, నిపుణులను రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకు ఎన్‌హెచ్‌పీసీకి ఈ బాధ్యతను అప్పగించింది.

ఈ పాపం.. చంద్రబాబుదే

పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని విభజన చట్టం సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నాడు సీఎం హోదాలో చంద్రబాబు కోరారు. ప్రత్యేక హోదాను కూడా తాకట్టు పెట్టేందుకు సిద్ధం కావడంతో 2016 సెప్టెంబరు 6న ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది. ఈ క్రమంలో 2013–14 ధరల ప్రకారమే నీటిపారుదల విభాగం వ్యయంలో మిగిలిన మొత్తాన్ని మాత్రమే రీయింబర్స్ చేస్తామని కేంద్రం విధించిన షరతులకు చంద్రబాబు తలొగ్గారు. రూ.3,302 కోట్ల విలువైన జలాశయం పనులను 'ఈనాడు' రామోజీరావు వియ్యంకుడికి చెందిన నవయుగకు, ఎడమ కాలువలో రూ.150 కోట్ల పనులను నాటి ఆర్థిక మంత్రి యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై కట్టబెట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండా డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు. ఈ పాపాల కారణంగానే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది.

కోతకు గురైన ప్రాంతంలో కొత్త డయాఫ్రమ్ వాల్

- దెబ్బతిన్న చోట సమాంతరంగా కొత్తగా నిర్మాణం
- మరో రెండు చోట్ల సరిదిద్దే విధానంపై సీడబ్ల్యూసీతో చర్చ

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

దత్తక్షేత్రాన్ని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



మక్తల్: కృష్ణానది ఒడ్డున వెలసిన కుర్మపురం దత్తక్షేత్రంలో దత్తస్వామిని హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. మండలంలోని పస్పుల గ్రామం సమీపంలో ఉన్న కృష్ణానది నుంచి బోటులో వెళ్లారు. ఆలయ కమిటీ తరపున న్యాయమూర్తిని సన్మానం చేశారు.

బాడీబిల్డింగ్‌లో ఆరోస్థానం



మహబూబ్‌నగర్ క్రీడలు: మధ్యప్రదేశ్ రాష్ట్రం రాట్లంలో ఆదివారం ముగిసిన మిస్టర్ ఇండియా జాతీయ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన సీనియర్ బాడీబిల్డర్ డాక్టర్ ప్రేమ్‌కుమార్ ప్రతిభ చాటారు. మాస్టర్స్ విభాగంలో ఆరోస్థానంలో నిలిచారు.

నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి



నారాయణపేట టౌన్: ప్రజలకు 14 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్లకు రాయితీలు ఇస్తూ, ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని అన్నారు. రాష్ట్రంలో 17వేల రేషన్ షాపుల ద్వారా కేంద్ర ప్రభుత్వం బియ్యం మాత్రమే 5 కేజీలు పంపిణీ చేస్తుందని, దానికి 5 కేజీల వరకు చేసి రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఇస్తుందన్నారు. వీటితో పాటు వంట నూనె, కంది పప్పు, పెసర పప్పు, గోధుమ పిండి, చక్కెర, టీ పొడి, ఉప్పు, పసుపు, కారం, చింతపండు, పల్లీలు, సబ్బులు, వంట గ్యాస్ ఇవ్వాలన్నారు. గ్యాస్ ధరలు విపరీతంగా పెంచి సబ్సిడీ కూడా ఎత్తివేశారన్నారు. ప్రజలను నిలువు దోపిడి చేసి, కార్పొరేట్లకి దోచి పెట్టడం సరికాదన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం


తాళి బొట్టును చూపుతున్న అర్చకుడు

- రామలింగేశ్వరుడి ఆలయంలో మార్మోగిన శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన ఆలయం


కల్యాణానికి హాజరైన మహిళలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలోని రామలింగేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అశేష భక్తజన సందోహం మధ్య కల్యాణం కమనీయంగా సాగింది. గ్రామంలో మహిళలు సిద్ధం చేసిన తలంబ్రాలను గ్రామస్తులు పల్లకిలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించారు. పల్లకీని రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి తీసుకు వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూల పందిరిలో ఉంచారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను సన్నాయి వాయిద్యాల నడుమ ఆలయం లోపలి నుంచి కల్యాణ మండపంలోకి తెచ్చారు. పురోహితులు ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలను కట్టించి, జీలకర్ర, బెల్లం పెట్టించారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ పార్వతి మెడలో మంగళసూత్రాన్ని కట్టించి కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. తరలివచ్చిన అశేష భక్తజనంతో ఆలయ పరిసరాలు శోభాయమానంగా వెలుగొందాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి చతుస్థానార్చన, మోహినీ అలంకరణ, గరుడవాహనసేవ నిర్వహించారు. గరుడ వాహనంపై విహరిస్తున్న స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. రాత్రి 10 గంటలకు స్వామివారికి కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.


గరుడవాహనంపై విహరిస్తున్న స్వామివారు

ఆర్‌ఎస్‌ఎస్ సేవలు అభినందనీయం


ప్రసంగిస్తున్న గంటా తిరుమల్

జడ్చర్ల టౌన్: ఆర్‌ఎస్‌ఎస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రాంత సహవ్యవస్థాప్రముఖ్ గంటాతిరుమల్ తెలిపారు. ఆదివారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన జడ్చర్ల గ్రామీణ–నగర సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 98ఏళ్లుగా సేవకులు దేశంలో ఏ విపత్తు వచ్చినా అక్కడికి వెళ్లి సేవ చేస్తున్నారన్నారు. హిందూ సంఘటన ద్వారా దేశాన్ని పరమ వైభవ స్థితికి తీసుకెళ్లటం లక్ష్యంగా నిత్యశాఖ పని చేస్తుందన్నారు. స్వయం సేవకులు శారీరక్ బౌద్ధిక్ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని, తద్వారా వ్యక్తి నిర్మాణం జరుగుతుందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగానే సమ్మేళనం నిర్వహించామన్నారు. అంతకుముందు హౌసింగ్‌బోర్డుకాలనీ నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్‌లో అఖండ జెండా ఎగురవేసి ధ్వజానికి వందనం చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న కరసేవకులు

సినీ దర్శకుడికి ఘన సన్మానం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో కృష్ణానది ఒడ్డున సర్కారు నౌకరి సినిమా చిత్రీకరణ చేస్తున్నారు. వాటిని పరిశీలించడానికి ఆదివారం దర్శకుడు రాఘవేంద్రరావు, తనికెళ్ల భరణి వచ్చారు. వారు అక్కడే ఉన్న సోమేశ్వరుని దర్శించుకున్నారు. ఈ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, సినిమాల చిత్రీకరణకు అనుకూలమైన ప్రదేశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

అలివేలుమంగమ్మ బ్రహ్మోత్సవాలు

- వైభవంగా అంకురార్పణ
- అమ్మవారికి స్వర్ణాలంకరణ


అలంకరణలో అలివేలు మంగతాయారు అమ్మవారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి సన్నిధిలో అంకురార్పణం, పుణ్యాహవచనం, అభిషేకం పూజా కార్యక్రమాలను నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. మొదటిరోజు అమ్మవారిని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య నిర్వహించిన కార్యక్రమం కనులపండువగా సాగింది. దేవస్థానాన్ని రంగు రంగుల విద్యుత్ బల్బులతో అలంకరించారు. మన్యంకొండ స్టేజీ నుంచి దేవస్థానం వరకు రోడ్డుకు ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. దేవస్థానం ముందు ఎల్‌ఈడీ లైట్లతో ముఖద్వారాలను ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతానికి కొత్త శోభ వచ్చింది. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు ధ్వజారోహణం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి సన్నిధిలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు.

జాతీయ రహదారిపై వేగనిరోధకాలు

అడ్డాకుల: జాతీయ రహదారిపై అవసరమైన చోట రహదారి నిర్వాహకులు వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే ప్రదేశాలను ఇటీవల భూత్పూర్ సీఐ రజితారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, రహదారి నిర్వాహకులు భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల్లో పరిశీలన చేశారు. ఈక్రమంలో ఎస్పీ నర్సింహ జిల్లాలోని రాజాపూర్, బాలానగర్, జడ్చర్ల, భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని రహదారిని క్షేత్రస్థాయిలో సందర్శించి బ్లాక్ స్పాట్లను గుర్తించారు. ఈ నేపథ్యంలో మూసాపేట మండలంలోని పోల్కంపల్లి స్టేజీ, వేముల స్టేజీ, అడ్డాకుల మండలంలోని కాటవరం స్టేజీ, వెల్టూర్ స్టేజీ వద్ద ఇటు కర్నూల్, అటు హైదరాబాద్ వైపు వాహనాలు వెళ్లే రోడ్లపై ఎస్ ఆకారంలో వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. ఆయా స్టేజీల వద్ద వాహనాల వేగం తగ్గేలా చర్యలు చేపట్టారు. రాత్రివేళ కనిపించడం కోసం వాటికి రేడియం స్టిక్కర్లను అతికించారు. వీటిని ఏర్పాటు చేయడం వల్ల వాహనాల వేగం తగ్గి రోడ్డు క్రాసింగుల వద్ద కొంత వరకైనా ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు.


పోల్కంపల్లి స్టేజీ వద్ద వేగ నిరోధకాలు

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

- బస్సులో మరిచిపోయిన రూ.50వేల నగదు అప్పగింత

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సులో నగదుతో ఉన్న బ్యాగును ప్రయాణికుడు మర్చిపోగా.. గుర్తించిన కండక్టర్ దానిని కంట్రోలర్, పోలీసుల సహాయంతో తిరిగి బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. వనపర్తి జిల్లా బుద్దారం గ్రామానికి చెందిన పెద్ద బాలయ్య పని నిమిత్తం బిజినేపల్లికి వచ్చేందుకు నాగర్‌కర్నూల్ డిపో బస్సు ఎక్కాడు. తన వెంట రూ.50వేల నగదు బ్యాగులో వెంట తెచ్చుకున్నాడు. బిజినేపల్లి రాగానే నగదు ఉన్న బ్యాగును బస్సులోనే మరిచిపోయి కిందికి దిగాడు. కొద్ది దూరం వెళ్లాక బ్యాగును గుర్తించిన కండక్టర్ బస్టాండ్‌లో కంట్రోలర్ అప్పగించారు. అయితే, బ్యాగును బస్సులోనే మర్చిపోయినట్లు గుర్తించిన పెద్ద బాలయ్య వెంటనే డయల్ 100కు ఫోన్ చేయడంతో స్పందించిన పోలీసులు బస్టాండ్‌కు చేరుకున్నారు. చివరికి పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది నగదు ఉన్న బ్యాగును బాధితుడికి అప్పగించారు. సదరు కండక్టర్‌కు, పోలీసు కానిస్టేబుల్ చిన్న, ఆర్టీసీ సిబ్బంది శంకర్‌నాయక్, సాయిబాబాకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.


జిల్లాకేంద్రంలో పెద్దబాలయ్యకు నగదు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు